క్లుప్తంగా

ఘనంగా శ్రావణ పౌర్ణమి

మదనపల్లె సిటీ: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని గురువారం స్థానిక బీటీకాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి 1008 పుష్పాలతో అలంకరించారు. సహస్రనామార్చన చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజులు చెల్లించాలి

మదనపల్లె సిటీ: 2023 మార్చి, మే నెలల్లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు 2024 మార్చిలో జరిగే పరీక్షలకు ఫీజును ఈ నెల 30లోపు చెల్లించాలని బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జీ.బాలకృష్ణమూర్తి తెలిపారు. మొదటి, ద్వితీయ సంవత్సరాలల్లో తప్పిన విద్యార్థులు ఫీజులు (స్పెషల్) చెల్లించి ప్రవేశాలు పొందవచ్చునన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హక్కుల కోసం ఐక్యం కావాలి

తంబళ్లపల్లె: హక్కుల కోసం ఎరుకలు ఐక్యం కావాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు రఘుపతి కోరారు. గురువారం పరపతోపు కాలనీలో ఏఐవైహెచ్‌పీఎస్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాలలోని ఎరుకలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, అవగాహన లేక హక్కులను సాధించుకోలేక పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు పెద్ద వెంకటరమణ, వీరాంజనేయులు, రెడ్డెప్ప, మంజుల, కుమార్, జయరామ్, నారాయణమ్మ, మల్లప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ట

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం ఉదయం విగ్రహప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యాగపూజ, మండపారాధన, నవగ్రహ హోమం, దుర్గా హోమం, లక్ష్మీ హోమం, శాంతి హోమం, నాడిసంధానం, ప్రాణప్రతిష్ట, కుంభాభిషేకం, మహాకుంభాభిషేకం, అలంకరణ చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పౌరహక్కులు అందరికీ సమానం

కలకడ : పౌరహక్కులు వ్యక్తులు అందరికీ సమానమని ఎంపీపీ శ్రీదేవి, తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. గురువారం సివిల్‌రైట్స్ డే సందర్భంగా మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ హరిజనవాడలో మానవహక్కులపై అవగాహన కల్పించారు. సమానపనికి సమాన వేతనం, అంటరాని తనం రూపుమాపడం వంటి వాటి గురించి తెలియజేశారు. వ్యక్తి హక్కులు, బాధ్యతలను సమానంగా తీసుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు లేని స్వేచ్ఛా జీవితం ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

బి.కొత్తకోట: నగర పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ పీఆర్.మనోహర్ హెచ్చరించారు. గురువారం ఆయన పారిశుధ్య పనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్మికులు చేస్తున్న పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పారిశుధ్య పనులపై ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చూస్తామన్నారు. ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. నగర పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సేవలు అందించే విషయంలో జాప్యం లేకుండా చూస్తామని చెప్పారు. ఆయన వెంట మేనేజర్ రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరిస్తాం

కలికిరి: దళితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పత్తేగడ గ్రామపంచాయతీ కొర్లకుంట గ్రామ పరిధిలోని తిమ్మారెడ్డిగారిదళితవాడలో అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైన అధికారులు స్థానిక సమస్యలపై విచారించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయనా, ఎక్కడైనా దళితుల పట్ల అంటరానితనం జరుగుతోందా విచారించారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని జెండామానుగుట్టలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్‌చేసి 34 (180మి.లీ.) టెట్రా ప్యాకెట్లు సీజ్ చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రాకాలనీ జెండామానుగుట్టకు చెందిన మూడే సుశీలమ్మ(40) స్థానికంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఉంచామన్నారు. పోలీసుల తనిఖీల్లో ఆమె ఇంట్లో మద్యం టెట్రా ప్యాకెట్లు లభించడంతో అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామన్నారు.

మూడు నెలల్లో సమ్మర్‌స్టోరేజి మొరవ పనులు పూర్తి

- రూ.40 కోట్లతో మొరవ, ప్రొటెక్షన్ వాల్ పనులు
- 43 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణం
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా


చిప్పిలి సమ్మర్ స్టోరేజ అభివృద్ధి పనుల మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించతలపెట్టిన చిప్పిలి సమ్మర్ స్టోరేజి ట్యాంక్ పెండింగ్ పనులను మూడునెలల్లో పూర్తిచేస్తామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం ఇరిగేషన్ ఈఈ రమేష్‌బాబుతో కలిసి మండలంలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకు 2004లో మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిప్పిలి సమ్మర్‌స్టోరేజి నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆయన హయాంలో కొంతమేర పనులు జరిగినప్పటికీ తర్వాత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం కనపరిచారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమ్మర్ స్టోరేజీ విషయాన్ని తీసుకెళ్లి ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా కోరామన్నారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 59వ ప్యాకేజీలో భాగంగా హంద్రీనీవా కెనాల్ కాట్లాటపల్లె టన్నెల్ నుంచి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ సరిహద్దు వరకు కాలువ విస్తరణకు, పెండింగ్ పనుల పూర్తికి రూ.1,230 కోట్లు కేటాయించారన్నారు. అందులో భాగంగా చిప్పిలి సమ్మర్ స్టోరేజి మొరవ నిర్మాణానికి రూ.20 కోట్లు, ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ.20 కోట్లు మొత్తం 40 కోట్లు కేటాయించారన్నారు. ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్ట్‌గా పరిగణించి మూడునెలల్లో పూర్తిచేయాల్సిందిగా సూచించారన్నారు. ఇరిగేషన్ ఈఈ రమేష్‌బాబు మాట్లాడుతూ.. సమ్మర్ స్టోరేజి ట్యాంకు 60 ఎంసీఎఫ్‌టీ నిల్వసామర్థ్యంతో నిర్మాణం చేసేందుకు ప్రతిపాదించారని, అయితే కొంతమేర సబ్ మెర్జ్ జరిగినందున ప్రస్తుతం 43 ఎంసీఎఫ్‌టీ నిల్వ ఉండేలా నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, చందూరెడ్డి, రెడ్డిప్రసాద్, గౌడసానివెంకటరమణ, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజా, బావాజాన్, ఇస్మాయిల్, కౌన్సిలర్ మేస్త్రీశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

మదనపల్లె సిటీ: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రహ్మకుమారి సెంటర్ ఇన్‌చార్జ్ పద్మావతి స్థానిక ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు రాఖీ కట్టి మిఠాయిలు అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో మురళి, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మనూజ, వైస్ చైర్మన్ జింకా చలపతి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓం ప్రకాష్ తదితరులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డిబాషా

కేవీపల్లె : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. గురువారం మండలంలోని సీకేఆర్‌పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడకుండా పర్యవేక్షణ ఉండాలన్నారు. నాడు- నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ఆర్మీలు సుధాకర్, నందకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- కుక్కల బెడద అధికంగా ఉందని, చర్యలు తీసుకోవాలన్న సభ్యులు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 20 అంశాలకు ఆమోదం


ప్రజా సమస్యలను చైర్‌పర్సన్ మనూజారెడ్డికి వివరిస్తున్న వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె : వర్షాభావంతో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడిన నేపథ్యంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సభ్యులకు రాఖీ పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశ ప్రారంభంలో ప్రజాయుద్ధనౌక, విప్లవగాయకుడు గద్దర్ ఆకస్మిక మృతికి సంతాపసూచకంగా రెండునిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...నీటిసమస్య ఉన్న ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది పర్యటించి పైప్ లైన్, బోర్ డ్రిల్లింగ్, రిపేరీ, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని ఆయా వార్డుల కౌన్సిలర్లు, తన దృష్టికి తేవాలన్నారు. నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్, దోమల నివారణ చర్యలు విస్తృతంగా చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ... పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. వైస్‌చైర్మన్ నూర్‌ఆజం మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న బాహుదా కాలువను శుభ్రం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాత్కాలికంగా కాకుండా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి శాశ్వత పద్ధతిలో బాహుదా కాలువను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిల్ సమావేశంలో భాగంగా అజెండాలోని 20 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పీలేరు : వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది వేతనంలో 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వడంతో సిబ్బంది, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటనతో రాష్ట్రంలో 4639 మంది వెలుగు సిబ్బందికి 23 శాతం ఇంక్రిమెంట్ లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుతో నీటిమట్టం పెంపు

కలకడ : ప్రతి ఇంటివద్ద వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, వీటి ద్వారా భూమిలో నీటిమట్టం పెరుగుతుందని ఓఎస్‌డీ రామచంద్రారెడ్డి, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ కిషోర్‌కుమార్, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని కలకడ, కె.బాటవారిపల్లె పంచాయతీలలోని జగనన్న కాలనీలను సందర్శించారు. ప్రతి ఇంటిముందు వర్షపు నీరు పడే చోట ఇంకుడు గుంతను ఏర్పాటు చేయడం వలన ప్రభుత్వం ప్రతి ఇంటి యజమాని ఖాతాలో రూ.6,000 జమ చేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈఈ వెంకటదాస్, హౌసింగ్ ఏఈ రమణయ్య, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నాగమునినాయక్ పాల్గొన్నారు.

జగనన్న పథకాలతో సంతృప్తి

కురబలకోట: జగనన్న పథకాలతో ప్రజల్లో సంతృప్తి కన్పిస్తోందని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రఖర్ రెడ్డి, ఎంపీపీ బి దస్తగిరి అన్నారు. గురువారం పిచ్చలవాండ్లపల్లె గ్రామంలో పల్లె బాట నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వివిధ సంక్షేమ పథకాలతో దేశంలో రాష్ట్రం రికార్డు సృష్టించిందన్నారు. ప్రజలకు మేలు చేకూర్చాయన్నారు. గోపాల కృష్ణారెడ్డి, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మేకల సురేంద్ర రెడ్డి, వసంత రెడ్డి, శివశంకర్ రెడ్డి, తిమ్మారెడ్డి, చేవేళ్ల రఘు, రాజశేఖర్, లోకేష్, వెంకటరెడ్డి, ఎంఈఓ ద్వారకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

– జాయింట్ కలెక్టరు ఫర్మాన్ అహ్మద్ ఖాన్


తహసీల్దారు కార్యాలయంలో ఓటరు క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కలికిరి: ఓటరు నమోదు, తొలగింపు, మార్పు ప్రక్రియను బీఎల్‌ఓలు పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టరు ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన మండల పరిధిలో జరుగుతున్న ఓటరు ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదు, తొలగింపు, అడ్రస్సు మార్పు క్లెయిమ్‌లను సుదీర్ఘంగా పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 1700 క్లెయిమ్‌లుండగా సుమారు 300 క్లెయిమ్‌లను పరిశీలించారు. ఓటరు ప్రక్రియలో ఏలాంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని బీఎల్‌ఓలను హెచ్చరించారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా మండలంలోని గుట్టపాళెం, కలికిరి రెడ్డివారిపల్లి గ్రామాలలో 40 క్లెయిమ్‌లను జేసీ నేరుగా విచారించారు. మరణించిన వారు అయితే మరణ ధృవీకరణ, కొత్త ఓటరు నమోదుకు వయస్సు నిర్ధారణ పత్రం, చిరునామా మార్పుకు దరఖాస్తు చేసుకున్న ఓటర్లను విచారించి పరిశీలించారు. బీఎల్‌ఓలు ఓటరు నమోదు, తొలగింపునకు కుటుంబ సభ్యుల నుంచి తప్పనిసరిగా ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు జే.భాగ్యలత, డీటీ సయ్యద్ అహ్మద్, ఏఎస్‌ఓ పుష్పలత, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలని డీఎల్‌డీవో, మండల స్పెషలాఫీసర్ లక్ష్మీపతి బీఎల్వోలను ఆదేశించారు. గురువారం ఆయనతో పాటు ఎంపీడీవో గిరిధరెడ్డి, ఆర్ఐ అనీషా మండలంలోని కందుకూరు, కాట్నగల్లు, టి.సదుం పట్టెంవాండ్లపల్లి పంచాయతీల్లో బీఎల్వోలు సేకరించిన ముసాయిదా ఓటర్ల జాబితా, సవరణలు, అభ్యంతరాల క్లెయిమ్స్‌లను క్షుణంగా పరిశీలించారు. మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్ల చేర్పులపై క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. ఓటరు జాబితాలో అర్హులైన పేర్లను నమోదు చేయాలని ఆయా గ్రామాల బీఎల్వోలకు సూచించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేసి అదే నెల 5వ తేదీన తుది జాబితా ప్రచురణకు అధికారులు వేగవంతంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వాహనాల వేలంలో రూ.2.30 లక్షల ఆదాయం


చిప్పిలి చెరువులో కర్ణాటక మద్యంను ధ్వంసం చేయిస్తున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : వివిధ ఎక్సైజ్, ప్రొహిబిషన్ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలకు ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.2.30 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం లభించినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఎస్ఈబీ అడ్మిన్ అడిషనల్ ఎస్పీ వి.బి.రాజ్‌కమల్, ఈఎస్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఏఈఎస్ రవి ఆధ్వర్యంలో మొత్తం 20 వాహనాలను వేలం వేశామన్నారు. అందులో 16 వాహనాలు అమ్మకం జరిగి ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అలాగే మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన నాటుసారా, కర్ణాటక మద్యాన్ని చిప్పిలి చెరువులో ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా తరలిస్తున్న నాటుసారాకు సంబంధించి 47 కేసుల్లో రూ.2.10 లక్షల విలువైన 2,111 లీటర్ల నాటుసారా, కర్ణాటక మద్యం తరలింపులో నమోదైన 31 కేసుల్లో రూ.4లక్షల విలువైన 406 లీటర్లు కర్ణాటక మద్యాన్ని ఎస్ఈబీ అధికారుల సమక్షంలో వాహనాలతో తొక్కించి ధ్వంసం చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనసూయమ్మ

తంబళ్లపల్లె: గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ అనసూయమ్మ తెలిపారు. గురువారం కొటాల, ఆర్ఎన్ తండా సర్పంచులు సహదేవరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రామక్రిష్ణల ఆధ్వర్యంలో పల్లెబాట నిర్వహించారు. కొటాలలో రూ.21లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.22 లక్షలతో హెల్త్‌సెంటర్ భవనాలను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు చేకూరిన లబ్ధి విషయాలపై వివరించారు. ప్రజల అభివృద్ధి కోసమే సీఎం జగన్ సంక్షేమ పథకాలను పారదర్శకంగా రాజకీయపార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన వారికి అందిస్తున్నారన్నారు. రాష్ట్ర చేనేత జౌళి... దృశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చౌడేశ్వర్, సింగిల్‌విండో చైర్మన్, భార్గవ్‌రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీఎం గంగాధర్, ఏపీఓ అంజనప్ప, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, కొండప్ప రాయల్, కోటిరెడ్డి, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.


బలిజల చిరకాల కోరిక సాకారం

- మాట నిలుపుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- బలిజల కమ్యూనిటీ భవనానికి 1.83 ఎకరాల భూమి కేటాయింపు


బలిజసేవాసమితి కార్యాలయంలో కృతజ్ఞతలు తెలుపుతున్న విజయకుమార్, కార్యవర్గసభ్యులు

మదనపల్లె : శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకున్నారు. పట్టణంలో బలిజల చిరకాల కోరికను సాకారం చేస్తూ మండలంలోని బసినికొండ పంచాయతీ సర్వేనెం.174/3లో కోట్ల రూపాయల విలువచేసే 1.83 ఎకరాల భూమిని కేటాయించారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను బుధవారం తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకలఅశోక్‌కుమార్, మదనపల్లె మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి సమక్షంలో బలిజసేవాసమితి అధ్యక్షులు బీపీఎల్.విజయకుమార్‌కు అందజేశారు. బలిజ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పట్టణంలోని బలిజసేవాసమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బీపీఎల్.విజయకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో పాలకులు బలిజకులాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని నిర్లక్ష్యం కనపరిస్తే...నేటి ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు బలిజల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా పట్టణ నడిబొడ్డున మల్లికార్జున సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడమే కాకుండా సొంతనిధులతో విగ్రహాన్ని సమకూర్చారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగునెలల్లోనే విలువైన స్థలాన్ని కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. కమ్యూనిటీ భవనానికి స్థల కేటాయింపులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, టీటీడీ బోర్డ్ మాజీ మెంబర్ పోకలఅశోక్‌కుమార్ కృషి మరువలేనిదన్నారు. అలాగే మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలిజసేవాసమితి ఉపాధ్యక్షుడు స్టోర్‌మోహన, పగడాల సూరి, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మీభాస్కర్, శ్రీనివాసులు, మదనేశ్వర్, భానుప్రకాష్ జంగాలశివరామ్, టి.శ్రీనివాసులు, రాజ్‌భవన్‌రాజా పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామీణ రోడ్లకు మహర్దశ


తారురోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ, అధికారులు

పెద్దమండ్యం: మండలంలోని గ్రామీణ రోడ్లకు జగనన్న పాలనలో, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో మహర్దశ కలిగిందని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీలో గురువారం సర్పంచ్ కంటి విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ శారదమ్మల ఆధ్వర్యంలో పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై మహిళలతో మాట్లాడారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. రెక్కలకొండపల్లె నుండి మల్లాలమ్మ గుడి వరకు రూ. 1.50 కోట్లతో ఏర్పాటు చేసిన తారు రోడ్డును ఎంపీపీ ప్రారంభించారు. జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్ బాషా, ఎంపీటీసీ మంచూరి జయరాం, పార్టీ మండల కన్వీనర్ చాను, రెడ్డెప్పరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ చాను పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ ఫలాలు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా లబ్దిదారులకు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో రెండోరోజు ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో అందిన లబ్ధి గురించి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో ఓ వర్గానికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. అదే మన ముఖ్యమంత్రి వై.ఎ. జగన్‌మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా అన్ని వర్గాల ప్రజలకు కులమత భేదం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతో తమ ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా ముఖ్యమంత్రి బటన్ నొక్కగానే లబ్దిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతోందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోరే మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, కాలువలు, రోడ్డు సమస్యల గూర్చి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హరిణి, జగన్‌మోహన్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, నాయకులు చలపతి, మహితాఆనంద్, సురేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజమ్మ, సపూరా, నాగభూషణంరెడ్డి, దావూద్, కాలనీ చిన్న, షాకీర్, బోదేషావలి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

నిమ్మనపల్లె : ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, అధికార బృందంతో కలిసి సమావేశం నిర్వహించారు. అయితే సమావేశానికి సంబంధించిన ముందస్తు సమాచారాన్ని దళిత నాయకులు, మండల విలేకరులకు సైతం తెలపకపోవడంపై మాలమహానాడు జిల్లా కార్యదర్శి వీరనాల మాణిక్యం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రెడ్డినారాయణ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో అధికశాతం మంది దళితనాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకాకపోగా, కార్యాలయానికి వచ్చిన వారితో సమావేశం సాగించారు. గత తొమ్మిది నెలలుగా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఎందుకు నిర్వహించలేదంటూ అధికారులను నిలదీశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దళితవాడల్లోని సమస్యలను ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి తెచ్చామని, ఆయన స్పందించి వెంటనే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసినా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. సమావేశానికి ఎంపీపీ నరసింహులు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. దళితనాయకులు మునిరత్నం, సహదేవ, ఎర్రయ్య, రాజన్న, సుధాకర, చెంద్రాయుడు, గంగులప్ప, రమణ పాల్గొన్నారు.

సమాచార లోపం లేకుండా చర్యలు

ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహణపై తహసీల్దార్ సీ.ఆర్. మంజుల వివరణ ఇచ్చారు. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమాచార లోపం కలిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజశ్రీ మదనపల్లె ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 03/2023
వాది: S.Reddy Kumar Reddy
మరియు
ప్రతివాదులు:
1. K.Reddy Rani
2. K.Yadagiri
సమన్లు
K.Yadagiri S/o K.Reddeppa
D.No.15-1-29A, Shivaji Nagar,
Madanapalli :Town and Mandal,
Annamayya District.
పై కనిన నెంబర్ దావాలోని వాది, దావా బాకీని రాబట్టుకొను నిమిత్తం ప్రతివాదులైన మీపై దావా దాఖలు చేసి వున్నారు. దావాలోని 2వ ప్రతివాది అయిన నీవు హాజరు కావాలని ఇందు మూలముగా సమన్సు జారీ చేయు నిమిత్తం – వాయిదా తేది. 22.09.2023 నాటికి వున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10 గం॥ 30 ని॥లకు పై కోర్టు నందు హాజరయ్యి మీకు ఆక్షేపనలు వున్న యెడల తెలుపుకొనవచ్చును. మీరు హాజరు కానంతట మీ పరం ఎక్స్‌పార్టీగా భావించి దావా తీర్మానించబడును.
వాయిదా తేది. 22.09.2023
కె. సోమశేఖర్, అడ్వకేట్
ఎన్.టి.ఆర్. సర్కిల్, మదనపల్లి

ఉచిత వైద్య శిబిరం
అమృత హాస్పిటల్
చిన్నపిల్లల మరియు జనరల్ హాస్పిటల్
యస్.వి.డీలక్స్ రోడ్డు, పీలేరు - 517214, 08584-240444, 9398902250
పీలేరు పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు శుభవార్త
నూతనంగా ప్రారంభించబడిన మన అమృత హాస్పిటల్ నందు
గుండె మరియు నరాల సంబంధిత వ్యాధులకు
ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడును.
తేది: 3వ తేది సెప్టెంబర్ 2023
సమయం: ఉ॥ 10 గం.ల నుండి మ॥ 2 గం.ల వరకు
MBBS., MD., Pediatrics (RUIA,TPT) PGPN, (BOSTON) Regd.No.APMC-91254
MBBS., MD., General Medicine FIDM, FICCM Regd.No.APMC-83583
MBBS., MD., (KMC Kurnool) D.M., Cardiology (JIPMER) Interventional Cardiology
MBBS., MD., General Medicine D.M., Neurology (KGH, AMC, Vizag) Consultant Neurologist
గమనిక: ఈ వైద్య శిబిరం నందు ఉచిత ఓ.పి.సౌకర్యం కలదు. మరియు రక్త పరీక్షలు నందు 50% డిస్కౌంట్ మరియు మందుల మీద 10% డిస్కౌంట్ కలదు.